వచ్చేనెలలో 'డీపవో' వెరిఫికేషన్: టీజీపీఎస్సీ

హైదరాబాద్, అక్టోబర్ 11(నమస్తే తెలంగాణ): డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్(వర్క్స్) గ్రేడ్-2 పోస్టుల భర్తీకి అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ వచ్చే నెలలో నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ శుక్రవారం ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నవంబర్ 8 నుంచి 11వరకు ఉదయం 10:30 గంటల నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నది. వివరాలకు వెబ్‌సైట్ https:// www.tspsc.gov.in చూడాలని సూచించింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలి: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, అక్టోబర్11 (నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం బడుగు బలహీనవర్గాలు, బీసీ విద్యార్థుల కోసం జాతీయస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి శుక్రవారం బహిరంగ లేఖ రాసి మీడియాకు విడుదల చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బీసీ సంఘాల పోరాటంతో దాదాపు 1500 లకుపైగా గురుకులాలు అందుబాటులోకి వచ్చాయని, అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కూడా అమలుచేస్తున్నారని పేర్కొన్నారు. ఏటా దాదాపు 30 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నట్టు లేఖలో పేర్కొన్నారు.

దసరా తర్వాత పోరాటం ఉధృతం

- 25 డిమాండ్ల సాధనకు కార్యాచరణ
- టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా పోరాటం

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): దసరా తర్వాత పోరాటం మరింత ఉధృతం చేయనున్నట్టు గురుకుల టీచర్ల జేఏసీ, టీఎస్ యూటీఎఫ్ నాయకులు తెలిపారు. రాష్ట్రంలోని పలు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకుల విద్యాలయాల్లో అపరిష్కృతంగా ఉన్న 25 రకాల డిమాండ్ల సాధనకు కొన్ని రోజులుగా పోరాటం చేస్తూనే ఉన్నట్టు పేర్కొన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు సమస్యల పరిష్కారానికి ఎలాంటి చొరవ తీసుకోలేదని వాపోయారు. దీంతో దసరా సెలవులు ముగిసిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీతోపాటు తెలంగాణ గురుకులాల్లో పేరుకుపోయిన విద్యార్థుల, ఉపాధ్యాయుల డిమాండ్ల పరిష్కారానికి నిత్యం పోరాటం చేయడానికి వెనకాడే ప్రసక్తే లేదని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు చావ రవి స్పష్టంచేశారు. మద్దతు ఇచ్చే ఉపాధ్యాయులందరిని కలుపుకొని పోతామని పేర్కొన్నారు. పాత టైంటేబుల్‌ను కొనసాగించాలనే ప్రధాన డిమాండ్‌తోపాటు పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా 25 శాతం వరకు మెస్‌చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తం 25 రకాల డిమాండ్లు ఉన్నాయని, వాటి పరిష్కారానికి పోరాడుతామని ఆ సంఘం నాయకులు స్పష్టంచేశారు.

పటిష్టంగా ప్రవాసీ ప్రజావాణి

మార్గదర్శకాలు జారీచేసిన చిన్నారెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): గల్ఫ్‌తోపాటు ఇతర దేశాల కార్మికులు, ఎన్నారైల కోసం ఏర్పాటుచేసిన ప్రవాసీ ప్రజావాణి ఫిర్యాదుల స్వీకరణ కేంద్రాన్ని పటిష్టంగా నిర్వహిస్తామని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జీ చిన్నారెడ్డి తెలిపారు. ప్రవాసీ ప్రజావాణి నిర్వహణ మార్గదర్శకాలను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ప్రతి మంగళవారం, శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి నిర్వహిస్తున్నామని, ఇందులో విదేశాల్లో ఉన్న బాధితుల పక్షాన వారి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు. వాటిని తదుపరి చర్యల కోసం సంబంధిత శాఖలకు పంపిస్తామని చెప్పారు. తాజా మార్గదర్శకాల ప్రకారం.. గల్ఫ్ తదితర దేశాల నుంచి మృతదేహాలను రాష్ట్రానికి తెప్పించడం, స్వగ్రామానికి అంబులెన్స్ ఏర్పాటు చేయడం, రోగులను స్వదేశానికి రప్పించడం, విదేశీ జైళ్లలో ఉన్నవారికి సహాయం చేసి విడుదలకు కృషి చేయడం, వీసా గడువును మించి అక్కడే నివసించడం, అత్యవసర పరిస్థితులు, క్షమాభిక్ష, జీతం బకాయిలు ఇప్పించడం తదితరాలను జీఏడీ-ఎన్నారై విభాగం నేరుగా పర్యవేక్షిస్తుంది. ఇది విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు, ఢిల్లీలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో అనుసంధానమై పనిచేస్తుంది.

ప్రజలపై మరింత రుణభారం!

- రుణపరిమితి దాటే దిశగా తెలంగాణ
- మూడో త్రైమాసికంలో 7,400 కోట్ల రుణాలు సమీకరించాలని నిర్ణయం
- చివరి త్రైమాసికంలో 9,000 కోట్లు మాత్రమే రాష్ట్రం పొందే అవకాశం
- పథకాల అమలుకు ఆర్థిక ఇక్కట్లు

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం మోపుతున్న రుణభారం క్రమంగా పెరుగుతున్నది. ఇప్పటికే రాష్ట్ర సర్కారు ఒక్కో వ్యక్తి తలపై రూ.17,873 అప్పు మోపగా.. అది మరింత పెరిగే అవకాశమున్నది. ఈ ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ నిర్దేశించిన రూ.49,255 కోట్ల రుణాల పరిమితిని దాటిపోయే దిశగా రేవంత్‌రెడ్డి సర్కార్ సాగుతున్నది. ఈ నేపథ్యంలో ఆదాయం పెంచడానికి అవసరమైన సంస్కరణలను ప్రవేశపెట్టాలని, అవసరమైతే సంస్థాగత పునర్నిర్మాణం గురించి ఆలోచించాలని సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా అధికారవర్గాలను ఆదేశించినట్టు తెలిసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రుణాల అంచనా క్యాలెండర్ ప్రకారం రేవంత్ సర్కారు 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో రూ.13 వేల కోట్లు, రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో రూ.18,500 కోట్లు రుణం పొందింది. ఆర్థిక సంవత్సరం సగం కూడా పూర్తికాకముందే రాష్ట్ర ప్రభుత్వం రూ.31,500 కోట్ల రుణాలను తీసుకున్నది. మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్) ముగిసే నాటికి ఒక్క ఆర్బీఐ నుంచి తీసుకున్న రుణాలే రూ.40,849 కోట్లకు చేరుకోనున్నాయి. మూడో త్రైమాసికంలో ఆరు విడతల్లో మరో రూ.7,400 కోట్ల రుణం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అక్టోబర్ ఒకటిన రూ.2000 కోట్లు ఆర్బీఐ నుంచి తీసుకున్నది. ఇక, చివరి త్రైమాసికం (జనవరి-మార్చి) నాటికి రూ.9,000 కోట్లు మాత్రమే మిగులుతాయి. ఇంకా సగం మంది రైతులకు రూ.2 లక్షలలోపు రుణమాఫీ కానేలేదు. వానాకాలం సీజన్ ముగిసినా రైతులకు రైతుబంధు ఇవ్వనేలేదు. పెండింగ్‌లో ఉన్న పంట రుణమాఫీ కోసం రూ.13,000 కోట్లు, రైతుబంధు కోసం మరో రూ.7,500 కోట్లు అవసరమవుతాయని అంచనా. ఉద్యోగులకు ఐదు డీఏ బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నది. ఇందుకు వార్షికంగా రూ.1,500 కోట్లు అవసరం అవుతాయి. ఈ నేపథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుకు ఆర్థిక ఇక్కట్లు ఎదురయ్యే అవకాశం ఉన్నది. ఈ కష్టాల నుంచి బయటపడేందుకు ప్రజలపై అదనపు పన్ను భారం మోపేందుకు సర్కారు సిద్ధమవుతున్నది.

ఆదాయం పెంచడానికి సంస్కరణలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో పేర్కొన్న ఆదాయ లక్ష్యాల్లో రాష్ట్ర ప్రభుత్వం కేవలం 33 శాతమే సేకరించింది. దాంతో గురువారం జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలిసింది. ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2.21 లక్షల కోట్లు ఆదాయంగా పొందాలని అంచనా వేసింది, కానీ సెప్టెంబర్ నాటికి పన్నుల ద్వారా రూ.75,000 కోట్లు మాత్రమే సేకరించగలిగింది. రాష్ట్రంలో ఇసుక, మద్యం డిమాండ్ పెరిగినప్పటికీ ఆ మేరకు ఆదాయం పెరగకపోవడం ఏమిటి? అని సీఎం ప్రశ్నించినట్టు తెలిసింది. ఆదాయ సేకరణలో లోపాలను గుర్తించాలని, అన్ని శాఖలు ఆదాయ సేకరణలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలని ఆదేశించినట్టు సమాచారం. వార్షిక లక్ష్యాలను చేరుకోవడానికి వారాంతపు లక్ష్య ప్రణాళికలను రూపొందించాలని, పన్ను సేకరణ ప్రక్రియలో పారదర్శకత, సమగ్రతను పాటించాలని సూచించినట్టు తెలిసింది. అదనంగా ఆదాయ సేకరణను పెంచడానికి అవసరమైన సంస్కరణలను ప్రవేశపెట్టాలని, అవసరమైతే సంస్థాగత పునర్నిర్మాణం గురించి ఆలోచించాలని సీఎం ఆదేశించినట్టు సమాచారం.

ఏపీకి కోట్లు..తెలంగాణకు సున్నాలు

- గోదావరి పుష్కరాలకు పైసా ఇవ్వని కేంద్రం
- నిధుల కోసం పోరాటంలో బీజేపీ, కాంగ్రెస్ విఫలం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం గోదావరి పుష్కరాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు రూ.100 కోట్లు ఇచ్చి, తెలంగాణకు గుండు సున్నా మిగిల్చిందని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు విమర్శించారు. ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా, రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా సాధించలేకపోయారని మండిపడ్డారు. తెలంగాణకు హక్కుగా రావాల్సిన నిధుల కోసం పోరాటంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. లోక్‌సభలో బీఆర్ఎస్ ఉండి ఉంటే, తెలంగాణకు అన్యాయం జరిగేది కాదన్నారు. కేంద్ర బడ్జెట్‌లోనూ తెలంగాణకు సున్నా కేటాయింపులు చేసి, ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం అదనపు గ్రాంట్ కింద రూ.15వేల కోట్లు ఇచ్చారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చారని తమకు బాధ లేదని, తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నదే తమ ఆవేదన అని తెలిపారు. నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచి తెలంగాణకు మొండి చెయ్యే చూపుతున్నదని విమర్శించారు. తెలంగాణ పట్ల ఇంత వివక్ష ఎందుకని నిలదీశారు. తెలంగాణను ఇతర రాష్ట్రాలతో సమానంగా చూడాలని, హక్కుగా రావాల్సిన నిధులను కచ్చితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల

కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత

వేల్పూర్, అక్టోబర్ 11: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటామని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పడిగెల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రమేశ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. పార్టీ తరపున రూ. 2 లక్షల బీమా చెక్కు మంజూరైంది. ఈ మేరకు వేల్పూర్‌లోని తన నివాసంలో మృతుడి భార్య రజితకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సభ్యత్వం కలిగిన కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే పార్టీ అండగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్రంలో 60 లక్షల పైచిలుకు మంది బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. బలమైన కార్యకర్తలు ఉన్న పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. బీమా కోసం దాదాపు రూ.11 కోట్ల ప్రీమియం పార్టీ చెల్లిస్తున్నదని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది కార్యకర్తలు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఇప్పటి వరకు 45 మందికి పైగా రూ.2 లక్షల చొప్పున పార్టీ ప్రమాదబీమా చెక్కులు కార్యకర్తల కుటుంబాలకు అందజేసినట్టు ఆయన పేర్కొన్నారు.

తెలంగాణకు అకున్ సబర్వాల్

కేంద్రం నుంచి రిలీవ్ అయిన ఐపీఎస్

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): సీనియర్ ఐపీఎస్ అధికారి అకున్ సబర్వాల్‌ను తెలంగాణకు తిరిగి పంపిస్తూ కేంద్ర ప్రభుత్వ అండర్ సెక్రటరీ సంజీవ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్నేండ్లుగా ఇండో టిబెటన్ బార్డర్ ఆఫ్ పోలీస్ (ఐటీబీపీ) ఐజీగా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. అకున్ సబర్వాల్‌ను ప్రీ మ్యాచ్యూర్ రిపాట్రియేషన్ ద్వారా తెలంగాణకు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందు ఇక్కడ కీలక బాధ్యతలు నిర్వర్తించిన ఆయన 2023లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖలోకి డిప్యూటేషన్‌పై వెళ్లారు. గతంలో తెలుగు సినీనటుల డ్రగ్స్ వ్యవహారం అకున్ సబర్వాల్ ఎక్సైజ్ కమిషనర్‌గా ఉన్నప్పుడే వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత కొంతకాలం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా పనిచేశారు. అకున్ సబర్వాల్ సతీమణి స్మితాసబర్వాల్ ప్రస్తుతం ఆర్థికసంఘం కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

అరగంట ముందే గేట్లు బంద్

- నవంబర్ 17, 18న గ్రూప్-3 పరీక్షలు
- అభ్యర్థులకు పలు సూచనలు చేసిన టీజీపీఎస్సీ
- మహిళా అభ్యర్థులు మంగళ సూత్రం, గాజులు తప్ప మరే ఆభరణాలు వేసుకెళ్లొద్దు

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): నవంబర్‌లో జరిగే గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై టీజీపీఎస్సీ కసరత్తు తీవ్రతరం చేసింది. 17, 18తేదీల్లో మూడు సెషన్లలో జరిగే పరీక్షలకు ఆలస్యంగా వచ్చే వారిని అనుమతించమని, అరగంట ముందుగానే గేట్లు మూసేస్తామని కమిషన్ ప్రకటించింది. మొదటి సెషన్‌కు ఉదయం 9:30 గంటలకు, రెండో సెషన్‌కు మధ్యాహ్నం 2:30కు గేట్లు క్లోజ్ చేస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. ఓఎమ్మార్ పద్ధతిలో నిర్వహించనున్న పరీక్షలపై కమిషన్ ముఖ్య సూచనలు చేసింది.

కమిషన్ సూచనలిలా..

- మొదటి సెషన్‌కు ఉదయం 8:30 నుంచి, రెండో సెషన్‌కు మధ్యాహ్నం 1:30 నుంచి అభ్యర్థులను పరీక్షాకేంద్రాల్లోకి అనుమతిస్తారు.
- అభ్యర్థులకు తెలుగు, ఇంగ్లిష్, లేదా ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ప్రశ్నపత్రాలిస్తారు. దరఖాస్తు సమయంలో ఎంపికచేసుకున్న ప్రకారం ప్రశ్నపత్రాలిస్తారు.
- నవంబర్ 17న ఉదయం సెషన్‌కు తీసుకెళ్లిన హాల్‌టికెట్‌నే మిగతా రెండు సెషన్లకు తీసుకెళ్లాలి.
- మహిళా అభ్యర్థులు మంగళసూత్రం, గాజులు తప్ప మరేలాంటి ఆభరణాలు ధరించరాదు.
- పరీక్షాకేంద్రంలో ఇతరులతో మాట్లాడినా.. వస్తువులను మార్చుకున్నా, నినాదాలు చేసినా, పరీక్షకు అంతరాయం సృష్టించినా ఆయా అభ్యర్థిని డిస్‌క్వాలిఫై చేస్తారు. ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తే క్రిమినల్ కేసులు పెడతారు.

అహంభావంతోనే కాంగ్రెస్ ఓటమి

సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): అహంభావ వైఖరితోనే హర్యానాలో కాంగ్రెస్ ఓడిపోయిందని, వైఖరిని మార్చుకోనిపక్షంలో మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లోనూ ఓటమి చవిచూడాల్సి వస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ హెచ్చరించారు. మెజారిటీ రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నా బీజేపీ పాలకులు మాత్రం జమిలీ ఎన్నికల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ఏపీలోని గూడూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రత్యేక హోదా కోసం చంద్రబాబు కేంద్రంతో చర్చించాలని సూచించారు. ఉద్దేశపూర్వకంగానే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. జగన్‌పై కోపంతో తిరుమల లడ్డూ వివాదంలో దేవుడిపై రాజకీయాలు చేయడం సరికాదన్నారు. తెలంగాణ మంత్రి కొండా సురేఖ బేషరతుగా సమంతకు క్షమాపణ చెప్పాలన్నారు.

చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిలిపిచెడ్ ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్
- పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన

చిలిపిచెడ్, అక్టోబర్ 11 : ఏఎస్సైని వేధించిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సై వేధిస్తున్నాడంటూ మెదక్ జిల్లా చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్‌లో ఈనెల 9వ తేదీ రాత్రి ఏఎస్సై సుధారాణి చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు బాధ్యుడైన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఎమ్మార్పీఎస్, దళిత సంఘం నాయకులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుచ్చేంద్ర మాదిగ, దళిత సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఏఎస్సై సుధారాణి ఆత్మహత్యాయత్నానికి స్థానిక ఎస్సై యాదగిరి కారణమని ఆరోపించారు. పెట్రోలింగ్ విషయంలో టార్గెట్ చేస్తూ మానసికంగా వేధిస్తున్నాడని ఏఎస్సై వాపోయినట్టు పేర్కొన్నారు. ఎస్సైపై చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

ఆన్‌లైన్‌లోనే 'పోలీసు' అనుమతులు

- సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి
- సీపీపీఎంఎస్ పోర్టల్ ప్రారంభం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): అన్ని రకాల పోలీసు అనుమతులను ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తామని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి వెల్లడించారు. కమిషనరేట్‌లో శుక్రవారం 'సైబరాబాద్ పోలీస్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(సీపీపీఎంఎస్)' పోర్టల్‌ను సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్నటి వరకు పోలీసు అనుమతుల కోసం దరఖాస్తుదారులు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇకపై అలా ఉండదని, వివరాలను ఆన్‌లైన్‌లో పూర్తిచేసి పేమెంట్ సైతం చెల్లించే అవకాశం కల్పించినట్టు తెలిపారు. నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్(ఎన్ఐసీ) సహకారంతో రూపొందించిన సీపీపీఎంఎస్‌తో దరఖాస్తుదారుల సమయం వృథా కాదన్నారు. ప్రస్తుతం కమర్షియల్, టికెట్లతో కూడిన ఈవెంట్లు, బ్లాస్టింగ్‌లకు సంబంధించిన అనుమతులను ఆన్‌లైన్‌లో జారీ చేస్తున్నామని వారం, పది రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు. 3నెలల్లో అన్ని రకాల అనుమతులను ఆన్‌లైన్ ద్వారా జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ(ట్రాఫిక్) జోయల్ డేవిస్ పాల్గొన్నారు.

380 కోట్ల ఆలయ పనులు రద్దు

- గ్రామీణ ఆలయాల అభివృద్ధిపైనా నిర్లక్ష్యం
- 3 నెలలుగా ఆగిన ధూప దీప నైవేద్యాలు
- గత ప్రభుత్వ ప్రణాళికలన్నీ బుట్టదాఖలు

హైదరాబాద్, అక్టోబర్ 11(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో హిందూ ఆలయాలపై కాంగ్రెస్ సర్కారు కక్షపూరిత వైఖరి అవలంబిస్తున్నది. 9 నెలల్లో ఒక్క ఆలయానికీ నయా పైసా కేటాయించని ప్రభుత్వం.. గత కేసీఆర్ సర్కారు చేపట్టిన పనులను ఒక్క కలం పోటుతో రద్దుచేసింది. ఇప్పటికే సీజీఎఫ్ పన్నును 12 శాతానికి పెంచగా, తాజాగా రూ.380 కోట్ల అభివృద్ధి పనులను రద్దుచేశారు. 150 గ్రామీణ ఆలయాలను సీజీఎఫ్ నిధులతో అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలనూ బుట్టదాఖలు చేశారు. ధూప దీప నైవేద్యం ఆలయాలకు 3 నెలలుగా వేతనాలను నిలిపివేశారు. ఆలయాలపై ప్రభుత్వ అవలంబిస్తున్న వివక్షను ధార్మిక సంఘాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి. గడచిన తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఆలయాలకు వచ్చే ఆదాయంతో సంబంధం లేకుండా భక్తుల విజ్ఞప్తి మేరకు నాటి కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధులను (ఎస్‌డీఎఫ్) కేటాయించి యాదగిరిగుట్టతోపాటు వివిధ ప్రధాన ఆలయాలను అభివృద్ధి చేసింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దాదాపు రూ.1,200 కోట్ల వ్యయంతో పునర్నిర్మించారు. దక్షిణ కాశీగా వెలుగొందుతున్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల కోసం 35 ఎకరాల భూమిని సేకరించడంతోపాటు ఆలయ అభివృద్ధికి రూ.70 కోట్ల వరకు ఖర్చు చేశారు. కొండగట్టు ఆంజనేయస్వామి, బాసర జ్ఞానసరస్వతి, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి, భద్రాచలం రామాలయం ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి నిధులు కేటాయించారు. ఇదే క్రమంలో జిల్లాల వారీగా ప్రధాన ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి దశలవారీగా పనులు చేపట్టాలని నిర్ణయించారు. కొన్ని పనులు పురోగతిలో ఉండగా, మరికొన్నింటిని ప్రారంభించాల్సి ఉన్నది. ఇందులో 23 ఆలయాలకు సంబంధించి రూ.380 కోట్ల పనులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత వారం రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన దేవాదాయ శాఖ మంత్రి.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన, చేపట్టిన పనులన్నింటినీ రద్దుచేయాలని అధికారులను ఆదేశించారు.

గ్రామీణ ఆలయాలపైనా చిన్నచూపు

సీజీఎఫ్ నిధుల ద్వారా 150 గ్రామీణ ఆలయాలను అభివృద్ధి చేసేందుకు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలను నేటి సర్కారు నీరుగార్చింది. స్థానికులు రూ.3 లక్షలు ఖర్చు పెట్టుకుంటే.. ప్రభుత్వం సీజీఎఫ్ ద్వారా ఒక్కో ఆలయానికి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయాలనేది ఈ ప్రతిపాదన. ఈ ప్రతిపాదననూ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసింది. ఒక్క కొత్త ఆలయాన్ని కూడా ఈ పథకంలో చేర్చకపోగా, గతంలో మంజూరు చేసిన 7,000 పైచిలుకు ఆలయాలకు 3 నెలలుగా వేతనాలు ఇవ్వడమే లేదు. దీంతో కొన్నిచోట్ల ధూప దీప నైవేద్యాలు నిలిచిపోయినట్టు అర్చక సంఘాలు ఆవేదన చెందుతున్నాయి.

అభివృద్ధి పనులు రద్దయిన ఆలయాల వివరాలు

ప్రాంతం	ఆలయం	నిధులు(రూ. కోట్లలో)
వేములవాడ	రాజరాజేశ్వర స్వామి	60
కొండగట్టు	ఆంజనేయస్వామి	100
బాసర	జ్ఞానసరస్వతి ఆలయం	50
ధర్మపురి	లక్ష్మీ నరసింహస్వామి	62.69
కాళేశ్వరం	శివాలయం	25
బీర్కూర్	సాయిబాబా	13
దుబ్బాక	వేంకటేశ్వరస్వామి	3
సిద్దిపేట	శివాలయం	2
తిమ్మాపూర్ (కామారెడ్డి)	వేంకటేశ్వరస్వామి	13.00
ముత్తారం (ఖమ్మం)	సీతారామచంద్రస్వామి	0.75
మహబూబాబాద్	రామమందిరం	1.15
అర్వపల్లి (సూర్యాపేట)	యోగానంద లక్ష్మీనరసింహస్వామి	1.00
నరసింహులపేట (మహబూబాబాద్)	వేంకటేశ్వరస్వామి	1.00
ఉగ్గంపల్లి (మహబూబాబాద్)	రామలింగేశ్వరస్వామి	0.40
చింతమడక (సిద్దిపేట)	శివాలయం	2.50
కొమురవెల్లి (సిద్దిపేట)	మల్లికార్జునస్వామి	0.10
కోనాయిపల్లి (సిద్దిపేట)	వేంకటేశ్వరస్వామి	1.50
దూరాజ్‌పల్లి (సూర్యాపేట)	లింగమంతుల స్వామి	0.18
సలాబత్‌పూర్ (కామారెడ్డి)	మారుతీ మందిర్	6.70
సింగోటం (నాగర్‌కర్నూల్)	లక్ష్మీనరసింహస్వామి	15
కోయిల్‌కొండ (నారాయణపేట)	రామ కొండ టెంపుల్	10
దేవరకొండ (నల్లగొండ)	గరుడాద్రి వేంకటేశ్వరస్వామి	6
ఇనుపాముల (నల్లగొండ)	పాచాల పార్వతీ సోమేశ్వరస్వామి	5
మొత్తం		379.97

ప్రమాదంలో పోలీసుల ఆరోగ్య భద్రత

దవాఖానలకు కోట్లలో బిల్లుల పెండింగ్

- చికిత్సకు ప్రైవేటు దవాఖానల నిరాకరణ
- నిర్దాక్షిణ్యంగా బయటికి పంపుతున్న వైనం?
- 'గోల్డెన్ అవర్'లో వెళ్లినా దక్కని ప్రాణాలు
- ఎరియర్స్, డీఏలు, సరెండర్లపై నోరు విప్పని ప్రభుత్వం

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): గుండెపోటు వచ్చిన ఏఆర్ ఎస్సై జనార్దన్‌రావును 'గోల్డెన్ అవర్'లో ఓ ప్రముఖ దవాఖానకు తీసుకెళ్లినా.. వారు 'పోలీసు ఆరోగ్య భద్రతా?' అని ప్రశ్నించి.. ఇక్కడ కుదరదంటూ వెనక్కి పంపడం, సమయం మించిపోయి అతను చనిపోవడంతో రాష్ట్రంలో పోలీసుల ఆరోగ్య భద్రతను ప్రభుత్వం గాలికి వదిలేసినట్టు తెలుస్తున్నది. పోలీసులు, వారి కుటుంబ సభ్యులు ఏ దవాఖానకు వెళ్లినా 'పోలీసు ఆరోగ్య భద్రతా?.. దానిపై వైద్యం చేయలేమని ముఖానే చెప్తున్నారు. ప్రతినెలా తమ వేతనం నుంచి వైద్య అవసరాల కోసం రూ.200 నాన్ రిఫండ్ కింద కట్ చేస్తున్నా.. తమకు అందాల్సిన వైద్యం సకాలంలో అందకపోవడంపై పోలీసు సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య భద్రత నుంచి దవాఖానలకు చెల్లించాల్సిన బిల్లులు పెండింగులో ఉండడం వల్లనే దవాఖానలు పోలీసులకు చికిత్స చేయడానికి నిరాకరిస్తున్నాయని వారు వాపోతున్నారు.

నిర్దాక్షిణ్యంగా బయటికి..

పోలీసు ఆరోగ్య భద్రత కింద రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఏబీహెచ్ సూపర్ స్పెషాలిటీ దవాఖానలు 14, మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వంటి 150కి పైగా హాస్పిటల్స్‌లో పోలీసులకు ఆరోగ్య సేవలు అందాల్సి ఉంది. అయితే వీటిల్లో కొన్ని దవాఖానలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు విడుదల కాక.. ఆరోగ్య భద్రత కార్డు అంటేనే వైద్యం చేయలేమంటూ చేతులెత్తేస్తున్నాయి. ప్రస్తుతం ఏఆర్ ఎస్సై జనార్దన్‌రావు విషయం ఒక్కటే బయటికి వచ్చిందని, ఎంతోమంది ఆ విషయాలు బయటికి చెప్పుకోలేక తమ వారిని ఎమర్జెన్సీ పరిస్థితుల్లో వదిలేయలేక అప్పోసొప్పో తెచ్చి వైద్యం చేయిస్తున్న ఘటనలు ఎన్నో ఉన్నాయని ఏఆర్ ఎస్సై జనార్దన్‌రావు మృతి విషయంలో వ్యవస్థను ప్రశ్నించిన ఓ పోలీసును అకారణంగా అడవుల పాల్జేశారని, తన పేరు బయటికి చెప్పుకోలేని ఓ ఉద్యోగి కన్నీటి పర్యంతమయ్యాడు.

రూ.వందల కోట్ల వరకు పెండింగ్..?

పోలీసులకు అందించిన వైద్యానికి గాను దవాఖానలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లులు రూ.వంద కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. ప్రతినెల మెడికల్ బెనిఫిట్ కోసం ఉద్యోగుల నుంచి వసూలు చేసే డబ్బులే రూ.1.5 కోట్ల వరకు ఉంటుంది. మరోవైపు తమ కుటుంబసభ్యులకు అందాల్సిన వైద్యం గురించి ప్రశ్నిస్తే.. పై అధికారులు అకారణంగా దూర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని సిబ్బంది కన్నీటి పర్యంతమవుతున్నారు.

దసరాకైనా పెండింగ్ బిల్లులొచ్చేనా?

పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ ఎరియర్స్, జీపీఎఫ్, మెడికల్ బిల్లులు, టీఏలు ఈ దసరాకైనా విడుదల చేయాలని పోలీసులు కోరుతున్నారు. సొంత డబ్బులు ఖర్చు చేసుకొని బందోబస్తుకు వెళ్తే.. టీఏలు ఇవ్వని దుస్థితి ఉందని అంటున్నారు. కానిస్టేబుల్ నుంచి పైస్థాయి అధికారి వరకు సగటున ఒక్కొక్కరికి సుమారుగా రూ.3 లక్షల వరకు ప్రభుత్వం బాకీ ఉందని అంటున్నారు.